క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను ఈనెల 28వ తేదీన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పి.రవికిరణ్ బుధవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

సత్తెనపల్లి: ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు విడుదలవుతున్న నేపథ్యంలో నిరుద్యోగులు, విద్యార్థుల సౌకర్యార్థం పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ శాఖా గ్రంథాలయానికి గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యే పుస్తకాలను గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం అందించినట్లు లైబ్రేరియన్ వాణి తెలిపారు. ఆన్ డిమాండ్ పుస్తకాల్లో భాగంగా రూ.40,090 విలువ కలిగిన ఆరు పుస్తకాలను అందించినట్లు ఆమె తెలిపారు.

కాశీవిశ్వేశ్వరుడికి అన్నాభిషేకం



సత్తెనపల్లి: పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈవీఎంలపై అపోహలు వద్దు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఈవీఎంల పనితీరుపై అనుమానాలుంటే తొలగించుకోవాలని తహసీల్దార్ ఎం. భవానిశంకర్ చెప్పారు. మండలంలోని కుందురువారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎన్నికల సమయంలో వేసే ఓటు సక్రమంగా ఉందో లేదో వీవీప్యాట్‌లో కనిపిస్తుందన్నారు. మీరు వేసిన ఓటుకు సంబంధించి స్లిప్ వస్తుందన్నారు. ఓటర్ల అపోహలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, సర్పంచ్‌లు చయికం వెంకటప్పారెడ్డి, గోపు అప్పమ్మ, బీఎల్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

క్రోసూరు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రోసూరులోని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంలో వినతిపత్రం బుధవారం అందజేశారు. కార్యాలయ సిబ్బంది తేళ్లూరి అంజిరెడ్డికి వినతిని అందచేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఆర్యవైశ్య సంఘ సర్వసభ్య సమావేశం

సత్తెనపల్లి: పట్టణ ఆర్యవైశ్య సంఘ సర్వసభ్య సమావేశం పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరు వెంకట హరేరామచెంచయ్య బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు, యువజన సంఘ సభ్యులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు సీజ్ చేయబడిన వాహనాలకు వేలం

క్రోసూరు: పోలీస్ స్టేషన్ సిబ్బంది పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎస్ఐ నరసింహులు బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు క్రోసూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్, మారుతి ఎస్టీడీ మోటార్‌కార్, పల్సర్ 150 డీటీఎస్ మోటార్ సైకిల్, ఆటో రిక్షా వాహనాలకు ఈ నెల 29న ఉదయం 11:00 గంటలకు బహిరంగ వేలం నిర్వహించబడుతుందని తెలిపారు. సదరు వాహనాల ధర రూ.2500, రూ.10,000, రూ.3,500, రూ.40,000గా నిర్ణయించడమైందన్నారు. సదరు పాట పాడిన ఖరీదుకు 12% జీఎస్టీ చెల్లించవలెనని తెలిపారు. ఆసక్తి గల పాటదారులు క్రోసూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాలను ముందుగా పరిశీలించుకోవచ్చన్నారు. వేలం అధికారి వద్ద రూ.2,000 డిపాజిట్ చేయవలెనన్నారు.

క్రీడా స్ఫూర్తిని నింపేలా ఆడుదాం ఆంధ్రా

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు
- అట్టహాసంగా రెండవ రోజు క్రీడా పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న గ్రామీణ క్రీడకారులు



పట్టణంలో క్రికెట్ జట్టు క్రీడాకారులతో చల్లంచర్ల, కమిషనర్ షమ్మి, కౌన్సిలర్లు

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 4, 5, 6 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు క్రికెట్ పోటీలు, ప్రగతి, హోలీ ఫ్యామిలీ, సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో అన్ని సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు వాలీబాల్ పోటీలను బుధవారం నిర్వహించారు. శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకొని మాట్లాడారు. క్రీడలను అభివృద్ధి చేయాలనే గొప్ప సంకల్పంతో సీఎం జగన్ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పరిచయం చేయాలనే లక్ష్యంతో సీఎం జగన్ ఈ క్రీడలను ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ సంక్రాంతికి ముందే అతిపెద్ద క్రీడా సంబరం ప్రారంభమైందన్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ ఆటల వల్ల శరీర దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పట్టణంలోని 13వ సచివాయ పరిధిలోని క్రీడాకారులకు హోలీఫ్యామిలీ పాఠశాల క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బండి మల్లిఖార్జునరెడ్డి టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలల్లో కౌన్సిలర్లు సయ్యద్ సలీం, రంగిశెట్టి సుమన్‌కుమార్, నాయకులు మొహమ్మద్ గని, విశ్వేశ్వరరావు, మున్సిపల్ డీఈ మధుసూధన్‌రావు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు..

గ్రామీణ ప్రాంతాల్లోని బాలబాలికలు ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. సత్తెనపల్లి మండలంలోని 19 సచివాలయాల పరిధిలో రెండో రోజు బుధవారం ఉత్సాహంగా ఆటల పోటీలు సాగాయి. సంక్రాంతి ముందే వచ్చినట్లు ఆయా గ్రామాల్లో క్రీడా సందడి నెలకొంది. అబ్బూరు గ్రామ సర్పంచ్ గొలదారి అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆటలాడే శక్తి సామర్థ్యాలు ఉండి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు లేని క్రీడాకారులకు మంచి అవకాశం ఈ ఆటల పోటీలన్నారు. క్రీడల వల్ల పోటీతత్వం పెరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ నోడల్ అధికారులు, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



అబ్బూరులో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



పెదమక్కెనలో బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు

యువతను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా'

క్రోసూరు: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా ఆటల కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపీపీ పి.కోటయ్య అన్నారు. బుధవారం మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆటల పోటీలు రెండవ రోజు ఉత్సాహ భరితంగా సాగాయి. క్రోసూరు జెడ్పీపాఠశాలలో ఆడుతున్న క్రీడాకారుల జట్లను ఎంపీపీ కలుసుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆటలంటే అందరికీ బాగా ఇష్టంగా ఉంటుందని అన్నారు. అయితే పని ఒత్తిడితో నేటి తరం ఆటలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అందుకని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి యువతను ఆటలలో ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసారన్నారు. యువత ఆటలు బాగా ఆడి రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి తదితరులున్నారు.

రెండవరోజు రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా

అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రెండవ రోజు బుధవారం రసవత్తరంగా జరిగాయి. పోటీలను అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు ప్రారంభించారు. స్నేహ పూర్వక వాతావరణంలో పోటీలు జరగాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. మొత్తం 8 టీంలు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. 10ఓవర్ల మ్యాచ్ నిర్వహించారు. ప్రతి సచివాలయం నుంచి రెండు టీంలు చొప్పున సుమారు 30 టీంలు రావడంతో రెండు గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించారు. చిగురుపాడు ఏ.బీ, అచ్చంపేట ఏ.బీ, కస్తల ఏ.బీ, కొండూరు ఏ.బీ జట్ల మధ్య పోరు హోరాహోరీగా జరిగింది. కొండూరులో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. అచ్చంపేట జెడ్పీహెచ్ స్కూల్ పీడీ ఆలపాటి సుజాత అంపైర్‌గా వ్యవహరించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన పోటీలు సాయంత్రం 5గంటల వరకు జరుగుతూనే ఉన్నాయి. గురువారం కూడా ఆటలపోటీలు కొనసాగుతాయని పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు తెలిపారు.



ఆడుదాం ఆంధ్రా ఆటల్లో భాగంగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



క్రికెట్ పోటీలకు టాస్‌వేస్తున్న సర్పంచ్ కంబాల వీరబాబు

విజేతగా రాజుపాలెం కబడ్డీ టీమ్



రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో రెండవ రోజు బుధవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు జరిగాయి. కొన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ ఆడించారు. రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్ ఆటలు జరిగాయి. సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, ఓర్సు వెంకటపతిలు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణలు పోటీలను ప్రారంభించారు. రాజుపాలెం సచివాలయానికి చెందిన కబడ్డీ టీమ్ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామ సచివాలయం సిబ్బంది, సర్వేయర్ శేషిరెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపాల కృష్ణ, వాసు, సూర్య పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'



పెదకూరపాడులో ఉత్సాహంగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



పెదకూరపాడులో రెండవ రోజు పోటీల్లో విజేతలు

పెదకూరపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు పెదకూరపాడు నియోజకవర్గ వ్యాప్తంగా హోరాహోరీగా సాగుతున్నాయి. రెండవ రోజు క్రీడకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. పెదకూరపాడు మండలంలోని పెదకూరపాడు జెడ్పీ, 75త్యాళ్ళూరు జెడ్పీ, గారపాడు జెడ్పీ పాఠశాలల్లో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో బ్యాడ్మింటన్‌లో లింగంగుంట్ల బీఎం-2, పెదకూరపాడు-2 బీఎం-1, పెదకూరపాడు-3, బీఎం2లు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో లింగంగుంట్ల వీబీఏ1 జట్టు, ముస్సాపురం వీబీ1 జట్టు, పెదకూరపాడు-2 వీబీ1 జట్టు విజేతలుగా నిలిచాయి. కబ్బడీలో ముస్సాపురం, పెదకూరపాడు-2, పెదకూరపాడు-1, పాటిబండ్ల జట్లు విజేతలుగా నిలిచాయి. క్రికెట్ పోటీల్లో పెదకూరపాడు-1, పెదకూరపాడు-2, ముస్సాపురం, హుస్సేన్‌నగరం, పెదకూరపాడు-3, పాటిబండ్ల లింగంగుంట్ల జట్లు విజేతలుగా నిలిచినట్లు కోఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి ధనలక్ష్మీ, ఎంపీడీవో నరసింహారావు, ఎంఈవోలు సత్యనారయణ, ప్రసాదరావు, హెచ్‌ఎంలు రమణ, శ్రీనివాసరెడ్డిలు క్రీడకారులను ఉత్సాహ పరిచారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ శివశంకర్



ముప్పాళ్ళ జెడ్పీ పాఠశాల విద్యార్థినుల హెల్త్ కార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

ముప్పాళ్ళ: విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పరిశీలనలో భాగంగా బుధవారం ముప్పాళ్ళకు విచ్చేసిన ఆయన ఆటల పోటీల్లో పాల్గొంటున్న పలువురు విద్యార్థినులు నీరసంగా ఉండటాన్ని గమనించారు. వారిని పక్కనే ఉన్న గ్రామ సచివాలయానికి హెల్త్ కార్డులు తీసుకొని రావాల్సిందిగా ఆదేశించారు. హెల్త్ కార్డులతో వచ్చిన విద్యార్థినులకు బంగారుతల్లి కార్యక్రమంలో అందిస్తున్న వైద్యసేవలపైనా ఆరా తీశారు. హెల్త్ కార్డుల్లో పూర్తి స్థాయిలో వివరాలు నమోదు కాకపోవటాన్ని గమనించి హెచ్ఎంని వివరాలు ఎందుకు నమోదు చేయటం లేదని ప్రశ్నించారు. సంబంధిత తరగతి ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడే వారికి ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అందించాల్సిందేనన్నారు. విధుల పట్ల బాధ్యతారహితంగా పనిచేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. సత్తెనపల్లి ఆర్డీవో రాజకుమారి, తహసీల్దార్ భవానిశంకర్, ప్రధానోపాధ్యాయురాలు కుంభా నాగేంద్రమ్మ తదితరులున్నారు.

గ్రామ వికాస కల్పనే ప్రభుత్వం లక్ష్యం



మాదల(ముప్పాళ్ళ): గ్రామ వికాస కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని వికసిత్ భారత్ జిల్లా పరిశీలకులు, ఎంపీ అజయ్‌ప్రతాప్‌సింగ్ చెప్పారు. మాదల గ్రామంలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం కిసాన్‌సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ప్రతి ఏడాది రూ.6వేలు అందించటం జరుగుతుందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఆరోగ్య బీమా పథకం అమలు చేశామన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రపంచంలో అన్ని రంగాల్లోను భారతదేశం ముందుండేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ కోటేశ్వరమ్మ, ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ అంజిబాబు, తహసీల్దార్ భవానిశంకర్, ఎంపీడీవో పుట్టారెడ్డి, వైద్యాధికారి రమాదేవి, బీజేపీ రాష్ట్ర పదాధికారి రవిశంకర్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు

- జనవరి 3 నుంచి ప్రారంభం
- 10 వేల మందికిపైగా ముగ్గుల పోటీల్లో పాల్గొనే అవకాశం
- భారీగా బహుమతులు



మాట్లాడుతున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పక్కన డాక్టర్ గీతాహసంతి, పక్కాల సూరిబాబు, భవనం రాఘవరెడ్డి

నకరికల్లు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే 2024లో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెస్తాయని తనను మరోసారి గెలిపిస్తాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పోటీలు ఇలా..

జనవరి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిలో, జనవరి 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీ స్థాయిలో, జనవరి 12న నియోజకవర్గ స్థాయిలో పెద్దఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2018-19లో 2,980 మంది, 2019-20లో 5,200, 2020-21లో 7,300, 2021-22లో 7,498, 2022-23లో 9,440 మంది పాల్గొన్నట్లు తెలిపారు. 2024 సంక్రాంతి ముగ్గులపోటీల్లో 10వేల మందికి పైగా పాల్గొనేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు.

లక్కీడిప్ ద్వారా బహుమతులు..

లక్కీడిప్ ద్వారా మొదటి బహుమతిగా ఒక డైమండ్ నెక్లెస్, రెండోబహుమతిగా రెండుకార్లు, మూడో బహుమతిగా మూడు ట్రాక్టర్‌లు, 4వ బహుమతిగా నాలుగుబుల్లెట్లు, ఐదోబహుమతిగా ఆరు షైన్ బైక్‌లు, ఆరోబహుమతిగా పది ఫ్రిజ్‌లు, 7వ బహుమతిగా 13 ఎల్‌ఈడీ టీవీలు, 8వ బహుమతిగా 75 మిక్సీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, 9989488484, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, 8885556318, ఎంపీపీ మేచారపు అనురాధ, 9959075608 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహసంతి, పక్కాల సూరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీబాషా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ లాల్‌బాషా, సొసైటీ అధ్యక్షుడు మేడికొండ మస్తాన్‌రెడ్డి, పరసా పెద్దబ్బాయి, ఏపీ డీసీ డైరెక్టర్ వీరారెడ్డి, సలీల్, మాబుల్లా, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బహుమతులిలా..

మొదటి బహుమతి గ్రామస్థాయిలో రూ.3 వేలు, మండలస్థాయిలో రూ.25 వేలు, నియోజకవర్గస్థాయిలో రూ.2 లక్షలు, ద్వితీయబహుమతి గ్రామంలో రూ.2 వేలు, మండలంలో రూ.15 వేలు, నియోజకవర్గంలో రూ.1లక్ష, మూడోబహుమతిగా గ్రామంలో రూ.1 వెయ్యి, మండలంలో రూ.10వేలు, నియోజకవర్గంలో రూ.50వేలు, నాలుగోబహుమతిగా గ్రామస్థాయిలో రూ.500లు, మండలంలో రూ.5వేలు, నియోజకవర్గంలో రూ.25వేలు, ఐదోబహుమతిని కన్సోలేషన్ రూపంలో ఇస్తామన్నారు.

గ్రేడ్-1 ఫార్మసిస్ట్ పద్మావతికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి



సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గ్రేడ్-1 ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న పద్మావతికి ఫార్మసీ సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమెను కందుకూరు బదిలీ చేశారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న పద్మావతికి బుధవారం వైద్యశాల ప్రాంగణంలో వీడ్కోలు సభ నిర్వహించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ పద్మావతి ఎంతో పట్టుదలతో పనిచేసేవారని, అలాంటి వారికి పదోన్నతి లభించి వెళ్లటం ఆనందంగా ఉందన్నారు. మరోవైపు మంచి సోషల్ వర్కర్ వెళ్లటం బాధగా ఉందన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ ఫార్మసీ విభాగంలో పద్మావతి ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. ఫార్మసీకి సంబంధించి పేదవారికి చక్కగా సహాయపడ్డారని, అలాంటి వారి సేవలను పొందలేకపోవటం బాధగా ఉందన్నారు. ఫార్మసిస్ట్ పద్మావతి మాట్లాడుతూ సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఎంతో ప్రాముఖ్యత కలిగిన వైద్యశాలని, తాను ఎన్నో వైద్యశాలల్లో పని చేసినప్పటికీ ఇలాంటి మంచి వాతావరణం గల వైద్యశాలలను ఎక్కడా చూడలేదన్నారు. అందులోను వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ లాంటి వ్యక్తి సహకారంతో వైద్యశాల దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ అందరం కుటుంబ సభ్యులులాగా పని చేశామని, ఇలాంటి మంచి వైద్యశాల నుంచి వెళ్లటం బాధగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో శోభారాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, వైద్యులు, స్టాఫ్ నర్సులు తదితరులున్నారు.

దత్తు సేవలు మరువలేనివి



కేసీపీ జీఎం వెంకట రమణ

మాచర్ల: భారతదేశంలో అత్యంత రాతి కట్టడమైన నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు దశాబ్దాల క్రితం సిమెంట్‌ను సప్లై చేసి సాగర్ నిర్మాణంలో పాత్ర పోషించిన డాక్టర్ దత్తు సేవలు మరువలేనివని కేసీపీ జీఎం వి.వెంకటరమణ అన్నారు. బుధవారం దత్తు 86వ జన్మదినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం, వివిధ దేవాలయాలలో పూజలు నిర్వహించారు. అనంతరం మీనాక్షి పీఎస్ఆర్ ఆంజనేయులు కంటి ఆసుపత్రిలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన జన్మదినం సందర్భంగా ఫ్యాక్టరీ ఆవరణలో నాణ్యత దినోత్సవాన్ని నిర్వహించి జీఎం మాట్లాడుతూ కేసీపీ నాణ్యతకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఈ సందర్భంగా సంస్థలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బంది, ఉద్యోగులకు జీఎం వెంకట రమణ, డీజీఎం రామకోటేశ్వరరావు, సీనియర్ మేనేజర్ బి.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీ జి.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావుతో పాటు పలువురు మాట్లాడి బహుమతులు అందేజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకుడు శివయ్య, లక్ష్మీనారాయణ, కేసీపీ సంస్థ ప్రతినిధి కోటేశ్వరరావు తదితరులున్నారు.

ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని విస్మరించారు

ప్రజావేదికలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

మాచవరం: పేదలకు పనిదినాలు కల్పిస్తూ, వారి జీవనోపాధిని మెరుగుపరచాలన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది విస్మరించారని, పేదలకు పనులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి బహిరంగ ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 01.04.2022 నుంచి 31.3.2023 వరకు జరిగిన రూ.4,61,44,981లకు గానూ 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 566 పనులు జరుగగా, వాటిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 548, పంచాయతీరాజ్ శాఖ ద్వారా 16, ఆర్‌డబ్ల్యూస్ ద్వారా 1, ప్రహరీ నిర్మాణం 1 పనులు జరుగగా, రోజువారీ వేతన చెల్లింపులు ద్వారా రూ.3,59,02,448, మెటీరియల్ చెల్లింపులు రూ.1,02,42,533 జరిగినట్లు తెలిపారు. సంతకాలు లేకుండా మస్టర్లు, దిద్దుబాట్లు తదితర అంశాలకు సంబంధించి మొత్తం రూ.26,063, జరిమానా ద్వారా రూ.8000 రికవరీకి ఆదేశించారు. జాబ్ కార్డు కలిగిన పేద ప్రజలకు పనులు కల్పించాల్సి ఉన్నా, ఏ గ్రామంలోనూ ఎస్సీ, ఎస్టీలకు పనులు కల్పించలేదని, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల వైఫల్యాన్ని నిలదీశారు. ఈ ఏడాది ఎస్సీలకు నూరు రోజులు పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో పథకం ద్వారా సాగు చేస్తున్న ఉద్యాన పంట తైవాన్‌జామపై సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మండలంలో సుమారు 200 ఎకరాల్లో జామసాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ సురేంద్రబాబు, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఆర్పీ బుజ్జి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ నన్నే షైదా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ తిరునాళ్లలో కుంకుమబండ్లు

మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లు గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు గ్రామస్తులు కుంకుమబండ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం కుంకుమబండ్లు అందంగా ముస్తాబు చేసి గ్రామ పురవీధులలో ఊరేగించారు.